ప్రతిపక్షనేత పర్యటనను అడ్డుకోవడం అధికార దుర్వినియోగమే

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అక్రమ కేసులతో పండుగ పూట పుంగనూరు టీడీపీ నేతల్ని మంత్రి పెద్దిరెడ్డి జైలులో పెట్టించి పెద్ద తప్పు చేశారని, పండగపూట జైలులో ఉన్నవారి కుటుంబాల ఉసురు పెద్దిరెడ్డికి తగలకమానదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆయన సోమవారం నిమ్మాడలో విలేకర్లతో మాట్లాడుతూ బాధితుల పరామర్శకు వెళ్తున ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు పర్యటనకు వ్యతిరేకంగా పెద్దిరెడ్డి బ్యానర్లు కట్టిండంచ, టీడీపీ బ్యానర్లు చించడం మరో తప్పుయని, ప్రతిపక్ష నేత పర్యటనకు వ్యతిరేకంగా పోలీసులపై ఒత్తిడి తెచ్చి సర్కిల్ ఇన్స్ పెక్టర్ చేత 30 యాక్టు నోటీసు ఇప్పించడం అధికార దుర్వినియోగమేనన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు కృష్ణా, గుంటూరు జిల్లాలలో పోలీస్ యాక్టు 30 ఉన్నా యదేచ్ఛగా కోడి పందేలు, జూదాలు జరుగుతున్నాయని, మరి ఇక్కడ పోలీస్ యాక్టు 30 ఏమైందని, కేవలం ప్రతిపక్షాల్ని ప్రజల వద్దకు, బాధితుల వద్దకు వెళ్లకుండా నిరోధించ దానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా రన్నారు. పెద్దిరెడ్డి తప్పు చేయకపోతే ప్రతిపక్ష నేతను ఎందుకు అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని, ప్రజల్ని బయపెట్టి లాండ్, శాండ్, వైన్, మైన్, రెడ్ శాండిల్ కుంభకోణాలు యదేచ్ఛగా చేస్తున్నారని, ఇవి బయటపడతాయనే భయంతోనే ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. దీనిపై డిజిపి జోక్యం చేసుకొని ప్రతిపక్ష నేత పర్యటన సజావుగా జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలి అచ్చెన్నాయుడు కోరారు.

మద్యపాన నిషేధం అని చెప్పి గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం

- అదే మద్యంతో వ్యాపారం చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ

- మండలం టిడిపి అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ

విశాలాంధ్ర-సారవకోట: మద్యపాన నిషేధం అని చెప్పి గద్దెనెక్కి, ఇప్పుడు అదే మద్యం తో వ్యాపారం చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని మండలం టిడిపి అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ ఆరోపించారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలను అన్ని విధాలుగా మోసం చేశారని, మహిళలకు భరోసా కల్పిస్తానని మద్యం అమ్మకాలతో వారి సౌభాగ్యాలు మంటగలుపుతున్నారని అన్నారు. మండలంలో మూడు రోజుల్లో ఏకంగా రికార్డ్ స్థాయిలో రూ.214 కోట్ల మద్యం అమ్ముడుపోయినట్లు ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయిని, న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31న ఏపీలో రూ.127 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని, మరి మండలస్థాయిలో ఇంత భారీ అమ్మకాలు జరిగితే ఇతర మండలాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో ఎన్నివేల కోట్లు మద్యం విక్రయాలు జరిపి ప్రజల వద్ద దోచుకుంటూ మోసం చేస్తున్నారని అన్నారు. మద్యపాన నిషేధం అమలు చేసి మా అక్క చెల్లమ్మల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తానని చెప్పి ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేసి ప్రతి గ్రామాల్లో అనాధికారం'గా విచ్చలవిడిగా మొబైల్ /బెల్టు షాప్ లు ప్రోత్సహించిన ఏకైక ప్రభుత్వం జగన్ రెడ్డి దని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా మద్యపాన నిషేధ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దేశ సేవలో లక్ష్మీనారాయణ సేవలు ఎనలేనివి

ఏపీజీబీసీ ఛైర్మన్ నర్తు రామారావు

విశాలాంధ్ర-కవిటి: దేశ సేవలో లక్ష్మీనారాయణ సేవలు నిస్వార్థమైనవి ఏపీజీబీసీ ఛైర్మన్ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం కొత్త పుట్టుగ గ్రామంలో అదే గ్రామానికి చెందిన నర్తు లక్ష్మీనారాయణ 17 సంవత్సరాలు ఆర్మీ ఉద్యోగంలో విధులు చేపట్టి ఇటీవల పదవీ విరమణ చెంది గ్రామానికి తిరిగి వచ్చిన నేపథ్యంలో ఏపీజీబీసీ ఛైర్మన్ నర్తు రామారావు, మాజీ ఎంపీపీ నర్తు చామంతి, గ్రామస్తులు లక్ష్మీనారాయణకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సైనిక దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందినటువంటి ఉద్యోగస్తుల గ్రూప్ అయిన మాతృభూమి రుణం తీర్చుకో గ్రూపు తరపు నుండి లక్ష్మీనారాయణకు దుస్సాలువా మేమెంటోలతో ఘనంగా సత్కరించారు. లక్ష్మీనారాయణ దేశ సేవలో నిస్వార్థంగా సేవ చేసి నేటి యువతకు ఆదర్శప్రాయుడయ్యాడని అన్నారు. ఆర్మీలో ఉద్యోగం చేసుకుంటూ బీటెక్, బికాం,ఎంబీఏ కోర్సులు కూడా అభ్యసించడం అతను దృఢ సంకల్పానికి నిదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రూపు సభ్యులు నర్తు సోమేశ్వర రావు, దేవరాజు, వాసుదేవ్, కోటేశ్వరరావు, సీతయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడి

విశాలాంధ్ర-బూర్జ : మండలంలోని మధనాపురం గ్రామంలో జనసేన కార్యకర్త గల్లంకి శ్రీనివాసరావు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కి శుభాకాంక్షలు తెలియజేస్తూ జనసేన బ్యానరుని గ్రామంలో ఏర్పాటు చేసి కదుతుండగా వైసీపీ కార్యకర్తలు వచ్చి శ్రీనివాసరావుపై బీర్ బాటిల్ పగలగొట్టి విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డారు.

శ్రీనివాసరావుతోపాటు తన తల్లి సావిత్రమ్మ, అక్క పొగిరి రమణమ్మపై పదిమంది వచ్చి దాడి చేశారు. గ్రామస్తుల అంబులెన్స్‌కు సమాచార మిచ్చి పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రవణమ్మకు చికిత్స అందిస్తున్నారు. శ్రీనివాస్‌కు తీవ్రంగా గాయాలవడంతో శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఈనెల 28న రథసప్తమి ఏర్పాట్లపై సమావేశం

విశాలాంధ్ర-అరసవల్లి : ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో ఈనెల 28-01-2023 జరుగు రథసప్తమి ఉత్సవాలపై జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, మున్సిపల్ శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, వివిధ శాఖలతో జరిగే సమన్వయ సమావేశం బుధవారం సాయంత్రం 04 గంటలకు శ్రీ సూర్యనారాయణ స్వామి వారి అనివెట్టి మండపంలో జరుగుతుందని ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఆదిత్యుని దర్శించుకున్న రాజమండ్రి ఎమ్మెల్యే భవానీ

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని సోమవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, రాజమండ్రి సిటీ శాసనసభ్యురాలు ఆదిరెడ్డి భవాని సకుటుంబంగా దేవాలయంనకు విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఇంచార్జ్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్. చక్రవర్తి, ఆలయ ఈవో వి. హరి సూర్య ప్రకాష్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : ఈనెల 18న బుధవారం ఉదయం 9 గంటలకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా కూన రవికుమార్ ఆధ్వర్యంలో ఆమదాల వలస బ్రిడ్జి దిగువన ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసే కార్యక్రమం ఉన్నదని టీడీపీ నాయకులు సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందగా కోరుతున్నామన్నారు.

బారెడు పొద్దెక్కినా తొలగని మంచు తెరలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: చలికాలం చంపేస్తోంది. ఉదయం వేళలో బారెడు పొద్దెక్కినా మంచు తెరలు తొలగక సూర్యకిరణాల కోసం నిరీక్షణ తప్పడం లేదు. సోమవారం జాతీయ రహదారి పై పరిస్థితి కొంత ఆందోళనకరంగానే ఉంది. నిండా మంచు కురుస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని నిదానంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ మాత్రం అశ్రద్ధ వహించినా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఉదయం 9 గంటలైనా జాతీయ రహదారులు, గ్రామ రహదారుల్లో మంచు కురుస్తుండడంలో వాహన దారులు ఇబ్బందులు పదుతున్నారు. మరో పక్క రబీలో వేసుకున్న అపరాలకు సైతం తీవ్రంగా దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుల ఉదారత

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని పెద్ద కర్రివానిపాలెం గ్రామానికి చెందిన కర్రీ రూపవతి భర్త ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ 6 వేలు రూపాయలు ఆర్థిక సహాయం అలాగే రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు రూపవతి కుటుంబానికి వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ళపై కేసు నమోదు

విశాలాంధ్ర-పోలాకి: పేకాట ఆడుతున్న జూదందారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నర్సింహామూర్తి తెలిపారు. సోమవారం బెలమర జంక్షన్లో ఇంటి ఆవరణలో జూదం స్థవరం పై దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పట్టుపడిన వారి వద్దనుండి దాదాపు లక్ష రూపాయలు దొరికినట్లు తెలిపారు.

కనుమరుగవుతున్న జట్కా బండి

ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాజుల కాలంలో ఉన్న రథాలు, గుర్రాలు, జమీందార్ల కాలం నాటి గూడు బళ్లు, జట్కా బళ్ల అంతరించి నేడు కాలచక్రంలో కనుమరుగవు తున్నాయి. నేటి కాలంలో అత్యంత వేగంగా పయనించే బస్సులు, ఆటోలు, కార్లు ప్రదాన ప్రయాణ సాదనాలుగా మారాయి. అయినప్పటికీ కొన్ని చోట్ల గుర్రంతో నడిచే జట్కా బళ్ల ప్రయాణ సాదనాలుగా నేడు కనిపించడం విశేషం. ముఖ్యంగా కోటబొమ్మాళి మండలం తిలారు, నారాయణవలస, జలుమూరు మండలం, పెద్దదూగాం, చిన్నదూగాం గ్రామాలకు చెందిన కొన్ని కుటుంబాలు వేరే వృత్తి చేపట్టలేక బ్రతుకు జట్కా బండిగానే జీవనం సాగిస్తున్నారు. చల్లపేట జంక్షన్ నుండి తిలారు రైల్వే స్టేషన్ వరకు నడిపే ఈ జట్కా బళ్లపై ఎక్కి ప్రయాణం చేయడమంటే ఇప్పటికీ కొంత మందికి సరదాగానే ఉంటుంది. కానీ జట్కా నడిపే యాజమానికే రోజంతా కష్టపడినా పూట గడవని పరిస్థితితో జీవిస్తున్నారు. వేలాది రూపాయిల వ్యయంతో గుర్రాన్ని కొని దానికి తర్ఫీదు ఇచ్చి జట్కా బండి నడుపుతున్నామని, గుర్రానికి గ్రాసం కూడా వేయలేని దుస్థితిలో ఉన్నామని జట్కా వారు తెలిపారు. తరతరాల నుండి సంక్రమించిన ఈ జట్కా బండి వృత్తిని వీడలేక, మరో వృత్తిపై నైపుణ్యం లేక బతుకుతున్నామని ఆవేదనను వ్యక్తం చేసారు. ఈ జట్కా బళు వల్ల వాయు కాలుష్యం ఉండకుండా ఇందనాలు పోదుపు అవుతున్నా ప్రభుత్వాలు, పాలకులు తమను అబినందించాల్సిందిపోయి తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. తమ దుస్థితి పట్ల ప్రభుత్వం స్పందించి సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్దికంగా ఆదుకోవాలని జట్కాదారులు కోరుతున్నారు.

పదిమందికి ఆదర్శంగా ఉండండి

విశ్రాంత న్యాయమూర్తి ఢిల్లీశ్వరరావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: తను చేస్తున్న పనిని ప్రేమిస్తూ,తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడంతోపాటు ప్రజలకు సేవ చేయడంలో యువత పదిమందికి ఆదర్శంగా ఉండాలని విశ్రాంత న్యాయమూర్తి ఎన్ని డిల్లేశ్వరరావు అన్నారు. పీపుల్స్ డెవలప్మెంట్ ఫారం వారి ఆధ్వర్యంలో ఆర్మీ డే సందర్భంగా పెద్ద పద్మాపురం గ్రామంలో పదవి విరమణ పొందిన విశ్రాంతి ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సన్మాన గ్రహీతలు ఎన్ని డిలేశ్వర రావు విశ్రాంత జిల్లా న్యాయమూర్తి, తూలుగు శంకర రావు ఆర్మీ రిటైర్డ్, మద్ది కృష్ణారావు నేవీ రిటైర్డ్, అలాగే విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో అసిస్టెంట్ లా ఇన్స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో భావి భారత పౌరులుగా దేశానికి సేవ చేయాలన్నారు. ఈ మధ్యకాలంలో పోలీస్, తదితర వివిధ రకాలైన సెలక్షన్ ఉండడం వల్ల దానిని ఉద్దేశించి ఎలా ప్రిపేర్ అయితే మనం విజయం సాధించగలం తదితర అనేకంశాలను యువతకు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెద్ద పద్మాపురం పీపుల్ డెవలప్మెంట్ ఫోరమ్ సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, విద్యావేత్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, ప్రజలు తదితరులున్నారు.

వాలీబాల్ ప్రథమ స్థానంలో కొర్లకోట

విశాలాంధ్ర-ఆమదాలవలస : జగనన్న సంక్రాంతి సంబరాలు-2023లో భాగంగా ఆమదాలవలస నియోజకవర్గంలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో నేతాజీ యూత్ (కోర్లకోట) నేతాజీ ఆధ్వర్యంలో వాలీబాల్ ప్రథమస్థానం గెలుపొదింది. వీరఘట్టం కొర్లకోట టీముల మధ్య జంక్షన్లో హోరాహోరీగా జరిగిన వాలీబాల్ ఫైనల్ పోటీల్లో కొర్లకోట జట్టు విజయం సాధించి 50వేల రూపాయలు నగదు తో పాటు పురస్కారాలు అందుకున్నారు. వీరు ఆటలో ప్రదర్శించిన తీరుతనులకు పలువురు క్రీడాకారులు అభినందించారు. క్రీడలపై ఈ పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని కలిగిస్తాయని పలువురు అన్నారు. వీరిని అభినందించిన వారిలో పలువురు క్రీడా అభిమానులు ఉన్నారు.

విద్యతోనే మనిషి అభివృద్ధి చెందుతాడు

విశాలాంధ్ర-మందస : విద్యాతోనే ప్రతి మనిషి అభివృద్ధి చెందుతారని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. మండలం బాహడపల్లి పంచాయతీ నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన పందిరి తేజేశ్వరరావు ఉన్నత చదువులు చదివి ఇండియన్ ఆర్మీలో డాక్టర్ పరీక్షల్లో 225వ ర్యాంక్ సాధించిన సందర్భంగా అతనికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొడ్డు తేజేశ్వరరావు, బత్తిని వెంకటరావు, ఎఎంసి డైరెక్టర్ మట్ట కూర్మారావు, మాజీ ఎంపిటిసి మామిడి కృష్ణారావు, దున్న బుజ్జి, కొర్నాన మట్ట కూర్మారావు, సాలిన జోగారావులు పాల్గొన్నారు.

పలాసలో : మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన సాహుకారి కిరణ్, ప్రవీణ్‌కు సర్పంచ్ తామాడ మదన్ సోమవారం ఘనంగా సన్మానించారు. కిరణ్ ఎస్ఎస్‌సి సిజిఎల్ జాతీయ స్థాయిలో 823 ర్యాంక్ సాధించి జీఎస్టీలో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నత ఉద్యోగం సాధించారని, ప్రవీణ్ సైనిక రంగంలో దేశానికి మంచి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో యువివి ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, బి.ఓంకార్‌లు పాల్గొన్నారు.

నువ్వాగడ కాలనీలో గ్రామసేవ

విశాలాంధ్ర-సోంపేట : కనుమ పండుగ పురస్కరించుకుని సోంపేట శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నువ్వాగడ కాలనీలో గ్రామసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి బిర్యానీ మరియు హల్వా మరియు స్వామి వారి ఫోటో, విభూది, ప్రసాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈపరి రవితో పాటు పలువురు సత్యసాయి సభ్యులు పాల్గొన్నారు.

అదిత్యుని ఆలయంలో గోపూజ

విశాలాంధ్ర-అరసవల్లి : ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో సోమవారం కనుమ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ గోపూజ కార్యక్రమం నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ మాట్లాడుతూ గోమాత దర్శనం సకల దేవత దర్శన పుణ్యమని గోవు నుంచి వచ్చే ప్రతిది ఔషధాలుగా కలిగి ఉంటుందని గోమాత హిందూ ధర్మ ప్రతీకాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇంచార్జ్ సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వరరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి ఎస్ చక్రవర్తి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారని ఆలయ ఈవో తెలిపారు.

స్పందించిన హృదయాలు.... పేద రోగికి చేయూత

విశాలాంధ్ర-పొందూరు : కవులకు కాలం చెల్లినా-కవి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి? ఎప్పుడో చెప్పారు అభ్యుదయ మహాకవులు. మానవత్వం పరిమళించే మంచి మనిషికి స్వాగతం సుస్వాగతం అన్న రచనలు నేడు గుర్తుకొచ్చే రీతిలో ఎందరో మహానుభావులు పేదల పట్ల మానవత్వాన్ని చూపిస్తూ తనదైన శైలిలో సేవలందించే త్యాగధనులు ఉన్నంతకాలం పేదవాడికి చేయూత అజేయమే అనడానికి నిదర్శనం. మండలం బొడ్డేపల్లి గ్రామానికి చెందిన గురుగుబిల్లి వాసుదేవరావు మూడేళ్ల చిన్నారి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని, అలమాజీపేట గ్రామానికి చెందిన పొందూరు ఎంపీటీసీ ఫోర్ ప్రతినిధి మండల టిడిపి ఉపాధ్యక్షులు బదాన శేషగిరి నాయుడు, బొడ్డేపల్లి వైకుంఠరావు ఆధ్వర్యంలో బ్లడ్ క్యాన్సర్ బాధిత కుటుంబానికి తనదైన శైలిలో ఆదుకోవాలన్న దృక్పథంతో స్పందించి 11 వేల రూపాయలు అందించారు. ఈ కుటుంబాన్ని ఆదుకోవడానికి మానవతావాదులు ముందుకు వస్తూ తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యం, బి. మధుసూదన్ బి. సత్యనారాయణ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సమాయత్తం!

- రెండేళ్లుగా అందని వేతనాలు

- 20 నుంచి ఉద్దానం, ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికులు సమ్మెకు నోటీసు

విశాలాంధ్ర-సోంపేట : జిల్లాలోని గ్రామాలు, పట్టణాల ప్రజలకు తాగునీరు అందించే ఉద్దానం మంచినీటి పథకంతో పాటు గ్రామీణ తాగునీటి పథకాల కార్మికులు అ నెల 20నుంచి సమ్మె చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈమేరకు జిల్లాలో పంచాయతీల ఈఓల నుంచి జిల్లా కలెక్టర్ వరకు, అలాగే ప్రజాప్రతినిధులకు తమ ఆవేదనతో కూడిన సమ్మె నోటీసులను అందజేశారు. గడచిన 24 సంవత్సరాలుకు సంబంధించి వేతనాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం తమ పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని పేర్కొంటున్నారు. ఎన్నోమార్లు వేతనాలు కోసం అధికారుల చుట్టు, ప్రజాప్రతినిధుల చుట్టు తిరిగినా ఇప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇటు ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో మంచినీటి పథకాల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ఆపరేటర్లు, మెకానిక్‌లకు ప్రతినెలా చెల్లించాల్సిన అరకొర వేతనాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో తమలాంటి చిన్నపాటి బతుకులు మరింత దీనస్థితికి చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు సకాలంలో అందక కుటుంబాలను నడవలేక అప్పులపాలై అనేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే సమ్మెకు దిగడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. కార్మికులు సమ్మెకు దిగితే గ్రామాలు, పట్టణాల్లో మంచినీటి సరఫరాకు పూర్తి అంతరాయం ఏర్పడి ప్రజలకు ఇబ్బందులు తప్పవని చెప్పవచ్చు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం వీరి పట్ల ఎటువంటి వైఖరి అవలంబిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో పలాస-కాశీబుగ్గ

నిబంధనలు పాటించరు... అధికారులు పట్టించుకోరు

విశాలాంధ్ర-పలాస : జిల్లాలో వాణిజ్య రంగంలో అభివృద్ధి చెందుతున్న పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో జిల్లా కేంద్రానికి ధీటుగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తితుండడంతో ప్రయాణీకులు ట్రాఫిక్ పద్య వ్యూహంలో చిక్కుకుంటున్నారు. ప్రధానంగా పండుగలు, పర్వదినాల్లో ఈ సమస్య మరీ ఎక్కువుగా ఉంటుంది. గడిచిన పదేళ్లల్లో జంట పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ అందుకు తగిన విధంగా ప్రత్యామ్నాయ రహదారులు లేదా వన్‌వే ట్రాఫిక్ నిబంధనలు అమలు కావడం లేదు. ఫలితంగా వాహన, పాదచారులు ప్రయాణం దినదిన గండం నూరేళ్ల జీవితంగా మారుతుందనే ఆందోళన ప్రజల నుండి వ్యక్తమవుతుంది. ఇందుకు పరిష్కార దిశగా మున్సిపల్, రెవిన్యూ, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, స్థానిక పుర ప్రజా ప్రతినిధులు పరిష్కారం దిశగా సమన్వయంగా చర్యలు లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో కేవలం కే.టి రోడ్డు మాత్రమే విస్తరణకు నోచుకొని అందంగా రూపుదిద్దుకుంటోంది. జంట పట్టణాల ట్రాఫిక్ మొత్తం ఈ రోడ్డుపైనే పడడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భగవతి థియేటర్ నిత్యానంద నగర్ రోడ్ వన్ వే ట్రాఫిక్‌గా మార్చిన ఆచరణ కావడం లేదు. అదే విధంగా శ్రీనివాసలాడ్జి నుండి డిగ్రీ కళాశాల రహదారి ఎంపిడిఓ కార్యాయయంనకు వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యే పరిస్థితులు లేవు. ఈ రెండు రహదారులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతుంటాయి. భగవతి థియేటర్ రహదారిలో సిమెంట్, ప్లాస్టిక్, ఎరువులు గొడౌన్‌లతో పాటుగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఆటోలు ఉండడంతో ఆ రహదారి గుండా వెళ్లాలంటే ట్రాఫిక్ పద్మవ్యూహం ఛేధించాల్సిందే. గతంలో ఆ రహదారిని వన్ వే ట్రాఫిక్‌గా పోలీస్ అధికారులు గుర్తించినా, ఆ దిశగా అక్కడ చర్యలు తీసుకోకపోవడంతో షరా మామూలే అన్నట్లు ఉంది. డిగ్రీ కళాశాల రహదారి ఉదయం 8 నుండి రాత్రి 9 గంటల వరుకు హౌరా బ్రిడ్జి తరహాలా ట్రాఫిక్ కనబడుతుంటుంది. శ్రీనివాస లాడ్జి జంక్షన్‌లో ఒక్కరే ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండడంతో డిగ్రీ కళాశాల రహదారిలో ట్రాఫిక్ నియంత్రణ తలకు మించిన భారమవుతుంది. అయితే ఇటీవల ఆ రహదారిలో బస్సులు నడవడం నిషేదించడంతో కొంత సమస్య తగ్గింది. అయినప్పటికీ ఆ రోడ్డు రెవిన్యూ రికార్డులు ప్రకారం ఉన్న 30 అడుగుల రహదారి విస్తరణ గాని వన్ వే ట్రాఫిక్ గాని చేయకుండా ట్రాఫిక్ సమస్యను నియంత్రించడం కష్టతరమంటున్నారు. అలాగే పలాస ఇందిరా చౌక్ నుండి పురుషోత్తపురం మీదుగా జూనియర్ కళాశాల వరకు రహదారి రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రణకు అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటుందని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రోడ్డు విస్తరణలో పలాస ప్రజా పోలీసుస్టేషన్ తొలగించడంతో కనీసం ఒక్క కానిస్టేబుల్ కూడా లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. అక్కడ ఉన్న మలుపు ప్రమాదకరంగానే ఉంది. కాశీబుగ్గ బస్టాండ్ ఆంధ్రా, ఒరిస్సాలకు ప్రధాన కేంద్రగా ఉండడం వలన సహజంగానే రద్దీగా అధికంగానే ఉంటుంది. జంట పట్టణాల్లో ప్రధాన రహదారితో పాటుగా అనుబంద రహదారుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాలంటే ముందుగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో వాహన చోదకులకు ప్రత్యేక హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్ గుర్తులు, పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సకాలంలో వైద్యం అందక ఆవు మృతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: అంగట్లో అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని ఉన్న చందముగా కనిపిస్తుంది రైతులు, పశువుల పెంపకందారుల పశువుల పరిస్థితి. రెండు మూడు సంవత్సరాలుగా మండలంలో రెగ్యులర్ పశు వైద్యాధికారి లేక అనారోగ్యానికి గురైన పశువులకు సకాలంలో వైద్యం అందక మూగజీవాలు మృత్యువాతకు గురవుతున్న పరిస్థితులపై ఎటువంటి మార్పు లేకపోవడంతో మండల ప్రజానీకం తీవ్ర నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. పండుగ నాడు పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన రైతుకు చెందిన ఆవు ప్రసవ సమయంలో మొయ్య దిగడంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మెళియాపుట్టి మండలం, పెద్ద పద్మాపురం గ్రామానికి చెందిన ఉర్లాన సంపత్ రావు అనే రైతు యొక్క ఆవు ఈనే సమయంలో దూడతో పాటుగా లోపల ఉన్న పేగులంతా బయటకు వచ్చి ఆదివారం ఆవు మృతిచెందింది. ఆవు ప్రసవ సమయంలో దూడతోపాటు పేగులు బయటకు రావడంతో స్థానికంగా ఉన్న సచివాలయంలో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ వచ్చి ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ ఆవు యొక్క ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి మార్పు లేకపోవడంతో, ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వెటర్నరీ అంబులెన్స్ సర్వీస్ వారితో సంప్రదించగా దీని పై వారు సకాలంలో రెస్పాండ్ అవ్వకపోవడం వల్ల ఆవుకి సకాలంలో సరైన వైద్యం అందక ఆవు మృతి చెందిందని రైతు కన్నీరు మున్నీరవుతున్నాడు. దీనిపై స్థానిక ఇంచార్జ్ పశు వైద్యాధికారి వారికి వివరణ అడగగా ఆవు ఈనే టైంలో దూడ ఫోర్స్ గా వచ్చే సమయంలో నైనా, ఫీడింగ్ స్టాండింగ్స్ లేకపోయినా గాని, ఆవు ఇనే టైంలో లెగ్మెంట్ పట్టి ఉంచుతుందని ఒకవేళ ఆ వ్యవస్థ ఫెయిల్ అయిన గాని ఇటువంటి పరిస్థితి జరగవచ్చునని వైద్యాధికారి తెలిపారు. ఆవు మృతి చెందడంతో బాధిత రైతుకు ఏదైనా ఇన్సూరెన్స్ పరంగా సహకారం అందించేందుకు అవకాశం ఏమైనా ఉందా అన్న ప్రశ్నకు జవాబుగా ఇన్సూరెన్స్ పరంగా స్కీం ఇటీవల కొన్ని రోజుల క్రితం క్లోజ్ అయిందని, కొత్తగా స్కీమ్ ఇంకా రావలసి ఉందని వైద్యాధికారి తెలియజేస్తున్నారు. గడిచిన ఇటీవల కొంత కాలంలో మండలంలో వేర్వేరు ప్రాంతాలకు సంబంధించిన ఐదారు పశువులు వివిధ కారణాలతో మృతి చెందినట్లు తెలుస్తుంది. శిథిలవస్థలో ఉన్న పశు వైద్యశాల స్థానంలో కొత్తగా నిర్మాణం జరిగిన పశు వైద్యశాల భవన నిర్మాణ ప్రక్రియకి సంబంధించి బిల్లులు చెల్లింపులు చేయడంతో పాటు ఇక్కడ రెగ్యులర్ గా పశువైద్యాధికారిని నియమించినట్లయితే ఈ ప్రాంతంలో పశువులకు సకాలంలో వైద్యం అందుతుందని, ఆ దశగా అటు పాలకులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కారం చేయాలని మండల ప్రజానీకమంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

సకల దేవతా స్వరూపం గోమాత

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: సకల దేవతా స్వరూపమైన, గో మాతను పూజించడం ద్వారా సర్వ సౌఖ్యాలు, శుభాలు కలుగుతాయని ప్రతీతి. హైందవ సంస్కృతి లో గోమాతకు ఎంతో విశిష్టత, ప్రత్యేకత ఉంది. ఎంతో పవిత్రమైన కనుమ పండగ రోజు గోమాత ను దర్శించుకోవడం ద్వారా 33 కోట్ల మంది దేవతలను దర్శించుకునే భాగ్యము కలుగుతుందని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ కోటదుర్గ ఆలయం ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాద్ శర్మ తెలియజేశారు. అనాది గో..మాతను పూజించే సంప్రదాయం హిందూ సమాజంలో వస్తుంది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా అంతటా కనుమ పండగ వేళ ప్రముఖ ఆలయాలైన శ్రీ కోటదుర్గ అమ్మవారి ఆలయం, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయం, కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి వారి ఆలయం, పాతపట్నం నీలామని తల్లివారి ఆలయాల్లో గోపూజ కార్యక్రమం శాస్త్రీయంగా నిర్వహించారు. సకలదేవతా స్వరూపమైన గోమాతను పూజించడం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ముక్కోటి దేవతలకు నిలయమైన గోమాత ను దర్శించుకోవటం ద్వారా సర్వ శుభాలు కలుగుతాయని నానుడి. ఎంతో విశిష్టతను సంతరించుకున్న గోమాత ను తండోపతండాలుగా వచ్చి భక్తులు దర్శించుకున్నారు. అంతకంటే ముందు కోటదుర్గ తల్లికు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచారపరిసత్ శ్రీకాకుళం జిల్లా శాఖ, టీటీడీ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన ఈ పూజల్లో శ్రీకాకుళం జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ కన్వీనర్ శాసపు జోగినాయుడు, సభ్యులు జల్లు నారాయణరావు, పైల తవిటినాయుడు, దుమ్మిద సింహాచలం, వారాడ రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలమట ఇంట రెండు పండుగలు

విశాలాంధ్ర -కొత్తూరు : తెలుగుదేశం పాతపట్నం నియోజకవర్గ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ ఇంట రెండు పండగలు జరిగాయి, ఒకటి సంక్రాంతి, రెండవది సంక్రాంతి రోజున మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ పుట్టినరోజు దింతో నియోజకవర్గ లోని పార్టి శ్రేణులు, అభిమానులు సంక్రాంతి రోజున మాతల చేరుకొని కలమటను అభినందించారు. పుష్ప గుచ్చాలు పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు, పాతపట్నం నుండి కలమట వెంకట రమణ ఒకేసారి ,ఆయన తండ్రి కలమట మోహన్ రావు 5 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఈ కుటుంబం అధికారంలో ఉన్నా... లేకున్నా... ఇలాంటి సందర్భాల్లో వారిని అభినందించే వారు ఎక్కువే అని చెప్పాలి.

జల్లికట్టును తలపించిన కోడెల

విశాలాంధ్ర -పొందూరు: మండలంలో సంక్రాంతి సంబరాలు ముగించుకుని రాపాక, లోలుగు, పొందూరు గ్రామాల్లో జల్లికట్టును తలపించే విధంగా కోడె బళ్ళు జాతరను నిర్వహించారు. రైతులు కనుమ ఉత్సవాలు భాగంగా పశువులకు పూజలు నిర్వహించి, గిత్తల కొమ్ములకు రంగులు, గిత్తల నడుముకు కొమ్ములకు బహు సుందరమైన రంగు తాళ్ళను అమర్చి రైతులు అంబరాన్ని తాకే రీతులో కొడబాళ్ళు సంపరాన్ని నిర్వహించారు.

కళాకారులకు సన్మానం

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి లో సంక్రాంతి పర్వ దినం సందర్భంగా అగ్నికుల క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో పలువురు కళాకారు లకు సన్మాన కార్యక్రమం, రంగవల్లిక పోటీలును నిర్వహించారు. రంగవల్లిక పోటీలలో గెలుపొందిన విజేతలకు సన్మాన కార్యక్రమం తో పాటు నగదు, జ్ఞాపికలను అందజేశారు. ప్రముఖ శిల్పి గుప్పి షణ్ముఖ రావు, గాయకుడు సంగారి రాము, పదవ తరగతిలో అత్యధిక మార్కు సాధించిన దున్న కాశి, పొల్లాయి జస్వంత్ తో పాటు స్మశాన వాటికలో సేవలందిస్తున్న ఉమాపతి, నూకయ్య లకు కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొల్లాయి లక్ష్మణ మూర్తి, పొల్లాయి దానయ్య, పొల్లాయి మండల అప్పారావు, పొల్లాయి సింహాచలం, పొల్లాయి కృష్ణ, దున్న పురుషోత్తం, తెప్పల రవి, సుజాత, లోకనాథం, దేవరాజు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంగమేశుని జాతరలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : సర్వమత సమ్మేళనమైన సంగమేశ్వరుని జాతరలో యువత కేరింతల కొడుతూ ప్రోత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి, కనుమ, ముక్కనుమలను పురస్కరించుకొని మూడు రోజులు జాతర జరుగుతుంది. రెండవ రోజు కనుమ కావడంతో ఎక్కువమంది యువతతో పాటు పలువురు ముక్కులు తీర్చుకునేందుకు మూడు మండలాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యంగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ సైకత శిల్పి గేదెల హరికృష్ణ రూపొందించిన సైకిత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. పోలీస్ బందోబస్తుల నడుమ జాతర రెండవ రోజు ప్రశాంతంగానే జరిగింది. కొంతమంది యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడా లని ప్రయత్నం చేసినప్పటికీ వారిని చేకచక్యంగా పోలీసులు నీలువరించారు. సాంప్ర దాయబద్ధంగా జరుగుతున్న పండుగ పూట ఈ జాతరను ఆనందోత్సాహాలు నడుమ జరుపు కుంటున్నారు.

ప్రభుత్వ భూములు మాయం

రెవిన్యూ భూమాయ?

విశాలాంధ్ర-పలాస/మందస : రాజకీయ అధికారం, ధనం, పలుకుబడిని అడ్డంగా పెట్టుకొని పలాస నియోజకవర్గం పరిధి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా కాంట్రాక్టర్లు, పలుకుబడి గల పెద్ద మనుషులు, రాజకీయ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు బహిరంగంగా దర్జాగా ఆక్రమించుకొని అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు సంపాదించుకుంటున్నారు. అత్యంత విలువైన ప్రభుత్వ, గిరిజన, రెవిన్యూ భూములు వందలాది ఎకరాలు అన్యాక్రాంతం చేసుకొని ప్రభుత్వ భూములు జిరాయితీలుగా మార్చుకొని కొనుగోళ్లు, అమ్మకాలు రూపేణ అక్రమ రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు వేదికగా జరుగుతున్నాయి. ఈ తంతుకు దిగువ స్థాయి రెవిన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలో మందస, చీపి, సాబకోట, హంసరాళి, బొగాబంద, కొంకడాపుట్టి, బసవసాయి, కొండలోగాం, కుసుమాల, ఉంగారుపుట్టి, బుదారిసింగి, తాళ్లగురంటి గిరిజన పంచాయతీల్లో ప్రభుత్వ రెవిన్యూ భూములు వందలాది ఎకరాలు ఆక్రమణలు జరిగాయి. నకిలీ రెవిన్యూ పట్టాలతో ఈ కబ్జాలు జరుగుతున్నాయి. రెవిన్యూ యంత్రాంగం గిరిజన ప్రాంతం, మైదానం ప్రాంతంలోని ప్రభుత్వ భూములను సబ్ డివిజన్ చేయకుండా ఒక్కొక్క సర్వే నెంబరులో ఉన్న భూములు కన్నా అత్యధిక భూములు ఉన్నట్టు అనేక మంది ప్రజలకు పట్టాలు రెవిన్యూ యంత్రాంగం మంజూరు చేసింది. పట్టాలు మంజూరు చేసిన వ్యక్తులు నుంచి ఎకరాలకు 2 లక్ష రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు కల్పిస్తున్నాయి. దీంతో ఏళ్ల తరబడి భూ పట్టాలు పొందిన వ్యక్తులు భూములు చూపించాలని మీ సేవా కేంద్రాల్లో ధరఖాస్తులు చేసుకున్నా వీరికి భూములు అప్పగించడం లేదు. దీంతో అనేక మంది గిరిజనులు, గిరిజనేతర పేదలు ధరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీరి భూ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వ భూములను రెవిన్యూ యంత్రాంగం రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, కాంట్రాక్టర్లకు, పలుకుబడి రాజకీయ నాయకులకు అమ్మేస్తున్నారు. దీని వెనుక రెవిన్యూ శాఖలోని కొంతమంది ఉద్యోగులు హస్తం ఉంది. మైదానం, ఉద్దానం ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేస్తున్న ప్లాట్లు వ్యాపారానికి సహకరిస్తున్నారు. ఈ వ్యాపారు ప్రభుత్వ భూములు జిరాయితీగా మారుస్తున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నెమలికొండ, సూదికొండ, కొసంగిపురం ప్రాంతాల్లో కూడా బాహాటంగా భూ కబ్జాలు జరుగుతున్నాయి. వజ్రపుకొత్తూరు మండలాల్లోని బెండి, వజ్రపుకొత్తూరు, పలాస మండలం రామక్రిష్ణాపురం గ్రామంలో బాహాటంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తూ దొరికిందే దోచుకో అన్న చందంగా తయారైంది. ఈ భూ కబ్జాలు వెనుక గత చరిత్ర కూడా ఉంది. 2014 సంవత్సరంలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నుంచి ఇప్పటి వైకాపా ప్రభుత్వ పాలన వరకు భూ దందాలు జరుగుతున్నాయి. గత టీడీపీ పాలకల్లో బడా కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలువురు రాజకీయ నాయకులు కూడా ప్రస్తుత వైకాపాలో కొనసాగుతున్నారు. పార్టీ పేరుతో ఈ దందా సాగిస్తున్నారు. వీరింతా గతంలో టీడీపీ ప్రభుత్వ పాలన టీడీపీ ముసుగులో ఉండే వారు. ప్రస్తుతం టీడీపీ ముసుగు తొలగించి వైకాపా ముసుగులో ఉండి వీరి అక్రమ భూదందా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిస్తున్నారు. వీరిని అరికట్టే నాధుడే కరువయ్యారు.

కనుమరోజు గోపూజలు నిర్వహిస్తే ఎంతో పవిత్రత

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : సంక్రాంతి పండగలో భాగంగా మూడోరోజైన కనుమ నాడు ప్రతి ఒక్కరు గోపూజ చేయాలని దానితోనే పవిత్రత చేకూరుతుందని కోటబొమ్మాళికి చెందిన ప్రముఖ వేదపండితులు సుసరాపు చంద్ర శేఖరశర్మ అన్నారు. మండలంలో గల ఊడికలపాడు గ్రామంలో సోమవారం కనుమ పండుగ సందర్భంగా శ్రీరామమందిర ప్రాంగణంలో గోమతలను గ్రామస్థలచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందువులకు అత్యంత పూజనీయమైన గోమాతలను పూజించటంతో పాటు ప్రతి ఇంటిలో ఓ పాడిగోవును పెంచే అలాంటి ఇల్లు, గ్రామాలు పూర్వపు పాపాలను తొలగి అష్ట ఐశ్వర్యాలు పొందుతారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఆవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, శ్రీరామమందిర్ ట్రస్టు సభ్యులు సనపల కరుణ్‌కుమార్, హనుమంతు వెంకటరావు, మెండ తిరుపలిరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎఫ్‌సిసి క్రికెట్ టోర్నమెంట్ విజేత ఎస్ఆర్‌సిపురం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ (ఎఫ్‌సిసి) ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో నిర్వహించిన సూపర్ సిక్స్ ఓవర్ క్రికెట్ టోర్నమెంట్‌లో కంచిలి మండలం ఎస్ఆర్‌సిపురం జట్టు విజేతగా నిలిచింది. సోంపేట ఎఫ్‌సిసి జట్టు ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ టోర్నమెంట్‌లో మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌గా ప్రవీణ్ ఎంపికయ్యాడు. స్థానిక హైస్కూల్ క్రీడామైదానంలో పెద్దసంఖ్యలో హాజరైన ప్రేక్షకుల నడుమ జరిగిన ఈ క్రికెట్ పోటీలకు అనేక జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కేవలం ఆరు ఓవర్ల పరిమిత మ్యాచ్‌లో ఎస్ఆర్‌సిపురం జట్టు విజేతగా నిలిచి 20వేల రూపాయల నగదును, మెమెంటోను సొంతం చేసుకున్నారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు పదివేల రూపాయలు, మెమెంటో అందజేశారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా సోంపేట సిఐ కె.రవిప్రసాద్, వైసిపి నేతలు డాక్టర్ ఉలాల కోదండరాం, తడక జోగారావు, కడియాల ప్రకాష్, గుమ్మడి రాందాసు, సర్పంచ్ ప్రతినిధి నగిరి శరత్‌బాబు, జనసేన నాయకుడు లోళ్ల రాజేష్, బెందాళం శోభన్‌బాబు, డాక్టర్ నర్తు కృష్ణంరాజు, తదితరులు హాజరయ్యారు. నిర్వాహకులు ఖుర్దా సురేష్, గుంటుకు బెనర్జీ, రవి, సురేష్, దుదిష్టి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం ఎంతో అవసరం

విశాలాంధ్ర -కవిటి: మోహనరావు కుటుంబానికి అండగా ఉండేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు అన్నారు. కపాసుకుద్ది గ్రామానికి చెందిన నిరుపేద మల్రి మోహన్ రావు (35) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు కలరు. విషయాన్ని తెలుసుకున్న కేసుపురం గ్రామానికి చెందిన శ్రీ కాళీమాత సంక్షేమ సంఘం 5 వేలు రూపాయలు, నిత్యవసర సరుకులు మోహనరావు కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు, సర్పంచ్ ప్రతినిధి కాయ్ భీమ్సేన్ చేతుల మీదుగా అందజేశారు. మరింత మంది దాతలు మోహనరావు కుటుంబ సభ్యులకు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళీమాత సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

విశాలాంధ్ర-మెళియాపుట్టి : చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2003 చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ద్వారా ఒకరినొకరు కలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. దారపు రాజేంద్రప్రసాద్ (ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లో ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న) ఆధ్వర్యంలో విద్యార్థులందరూ చాపర జెడ్పీ హై స్కూల్ లో కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఇటువంటి సందర్భం రావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రతి విద్యార్థి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టపగలు సత్యనారాయణ, జపాన్ ఈశ్వరరావు, దుక్క బాలరాజు, నక్క గోపమ్మ, జడ్డేటి సోమేశ్వరరావు, శెట్టి డాల్బియా, శ్రీనివాసన్ శ్రీకాంత్, గేదెల ధర్మారావు, సిరిపురం భాస్కర రావు, తలగాన సింహాచలం, విష్ణు ప్రియ సాహెరా, బిందు పట్నాయక్, కమల కుమారి, పారువల్లి రూప, తదితరన్నారు.

విజయకేతనం ఎగురవేసిన హీరాపురం జట్టు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మండలంలోని హీరాపురంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలలో వీరాపురం జట్టు విజయకేతనం ఎగురవేసింది. సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. మూడు రోజులపాటు పలు గ్రామాలకు చెందిన క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్లో పాల్గొన్నాయి. చివరి టోర్నమెంట్ క్రీడా పోటీలలో తోటూరు-హీరాపురం జట్లు చేరుకున్నాయి. రెండు జట్లు హెరాహెరీగా తెలపడ్డాయి. ముందస్తు బ్యాటింగ్ చేసిన తోపూరు జట్టు 20 ఓవర్లలో 112 పరుగులు చేయగా తదుపరి హీరాపురం జట్టు 113 పరుగులు చేసి విజయం సాధించింది. మొదటి బహుమతిగా పదివేల రూపాయలు, రెండవ బహుమతిగా ఐదు వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, బర్రు మాధవరావు, పాపారావు, యువత తదితరులు ఉన్నారు.

మందసలో రియల్ దందా

సాగునీటి కాలువలు, ప్రభుత్వ భూములు కబ్జా

విశాలాంధ్ర-మందస : మందస పంచాయతీలో ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతులు లేని ఈ వ్యాపారం బాహాటంగా సాగుతున్నప్పటికీ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వ శాఖలు మౌనం దాల్చాయి. వివిధ శాఖల్లోని ఉద్యోగులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద ఉచితంగా ప్లాట్లు, లక్షల్లో డబ్బులు తీసుకొని ఇటువంటి వ్యాపారానికి బహిరంగంగా ప్రోత్సహిస్తున్నారు. పంచాయతీలో 20 చోట్ల సుమారు 150 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. పంట పొలాల్లో మట్టి, కంకర కప్పి సాధారణ స్థలాలుగా మార్చి ప్లాట్లు వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన ఈ ప్లాట్లు పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ పోరంబోగు భూములు, సునాముది సాగునీటి కాలువ, ఫారెస్టు భూములను కూడా కబ్జా చేసి ప్లాట్లు రూపంలో నకిలీ సర్వే నెంబర్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇటువంటి భూములు క్రయ విక్రయాలకు స్థానిక సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం వేధికగా తయారైంది. అనుమతులు లేని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కనీసం ప్రభుత్వ శాఖలు నుంచి అభ్యంతరాలు కూడా లేవు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్మకాలు చేసినప్పటికీ ఇటువంటి ప్లాట్లులో విద్యుత్ స్తంభాలు, లైట్లు అనేక చోట్ల ప్రభుత్వపరంగా అమర్చారు. పంచాయతీ ఎన్‌వోసి లేకుండా విద్యుత్ స్తంభాలు రియల్ ఎస్టేట్ అమ్మకాలు చేస్తున్న స్థలాల్లో అమర్చకూడదు. కాని పబ్లిక్‌గా విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇకపోతే ఇటువంటి రియల్ ఎస్టేట్ ప్లాట్లులో నివాస గృహాలకు శుద్దజలం పంపిణీ చేసేందుకు పంచాయతీ ఉద్యోగులు ప్రోత్సహంతో ఇటీవల ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పైపులైన్ కూడా వేశారు. ఈ పైపులైన్ నిర్మాణంలో పంచాయతీ ఉద్యోగులు ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖపై తీవ్ర ఒత్తిడి చేశారని అంటున్నారు. 15 కోట్ల రూపాయల వ్యయంతో శుద్దజలం ఇంటింటికి కుళాయిలు ద్వారా పంపిణీ కోసం ప్రభుత్వ పైపులైన్లు నిర్మాణం కోసం చర్యలు చేపట్టింది. ఈ నిధులతో గ్రామంలో పైపులైన్లు నిర్మాణం చేయకుండా సగం పైపులైన్ నిర్మాణం పనులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లులో జరిపారంటే ప్రభుత్వ శాఖలు పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలకు భిన్నంగా ప్రభుత్వ అనుమతులు లేని ప్లాట్లుకు విద్యుత్, శుద్దజలం వంటి తాగునీరు సౌకర్యం ఎలా కల్పిస్తున్నారో అంతుబట్టని విషయంగా చర్చనీయాంశంగా తయారైంది.

ఘనంగా దేకుర కొండ జాతర

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ పరిధి పలాస ఉదయపురం దేకురు కొండ వద్ద సంక్రాంతి సందర్భంగా ఆదివారం యాత్ర జరిగింది. తర్లాకోట జమిందారుల హయాం నుండి కొనసాగుతున్న సాంప్రదాయ యాత్రలో పురపాలక సంఘం ప్రజలతో పాటు చుట్టు ప్రక్క గ్రామీణ ప్రాంత ప్రజలు దేకుర కొండపై వెలిసి ఉన్న నీలకంఠేశ్వర దేవాలయాన్ని దర్శించుకుంటారు. అనంతరం జారుడు కొండపై దేకురితే పాపాలు హరిస్తాయని నానుడి ప్రచారంలో ఉండడంతో యాత్రకు వచ్చిన వారంతా జారి తమ కోర్కెలు తీర్చాలని, తమ తప్పులు మన్నించాలని వేడుకొంటు కొండపై మహిళ, పిల్లలు, వృద్దులు జారారు. కొండకు వెనుకభాగంలో ఉన్న శివలింగం దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సంక్రాంతి సందర్భంగా పట్టణ పుర ప్రజలు భారీగా కొండపైకి చేరుకొని యాత్రలో పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిణీ

విశాలాంధ్ర-కవిటి : ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబాలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. మండలంలోని కొత్తపుట్టుగ గ్రామంలో ఏపీజీబీసీ చైర్మన్ నర్తు రమారావు నివాసం వద్ద నిరుపేద కుటుంబాలకు నర్తు రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపీజీబీసీ చైర్మన్ నర్తు రామారావు, మాజీ ఎంపీపీ నర్తు చామంతి చేతుల మీదుగా నిరుపేద కుటుంబాలకు సంక్రాంతి కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్తు శివాజీ తో పటు గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరంలో గోపూజ

విశాలాంధ్ర-జలుమూరు : శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కనుమ పండగ సందర్భంగా గోపూజ మహోత్సవం నిర్వ హించినట్లు ఆలయ ప్రధానార్చకులు నాయుడు గారి రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవును జాతీయ జంతువుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని అర్చక పెద్దలంతా కోరుకుంటున్నామన్నారు. గోమాతను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లే అన్నారు.

కనుమ రోజు భోగి

విశాలాంధ్ర -మెళియపుట్టి: మెలియాపుట్టి మండలం కోసమాల గ్రామంలో దేవాంగుల వీధిలో కనుమ రోజు భోగి జరుపుకునే సంప్రదాయాన్ని గ్రామస్తులు తరతరాల నుంచి కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళితే ఈ గ్రామంలోని దేవాంగాల వీధిలో నేత కార్మికులు ఎక్కువ మంది ఉండేవారు అందువలన సంక్రాంతి రోజు వరకు తమ బట్టలు నేతతో బిజీగా ఉండేవారు అందువలన వీరికి భోగి చేసుకునే అవకాశం ఉండేది కాదు అందువలన వీరు కనుమ రోజు భోగిని చేసుకునేవారు ఇప్పటికీ కూడా ఆ వీధిలోని ప్రజలు కనుమరోజే బోగీని జరుపుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని డివిఎన్ సురేష్, పి. ఉమాశంకర్, బి వీరభద్రరావు, బి. మోహన్ రావు, బి తేజేశ్వరరావు తదితరులు తెలియజేస్తున్నారు.

నేటి నుండి కాశీవిశ్వేశ్వర స్వామివారి వార్షికోత్సవం

విశాలాంధ్ర -జలుమూరు: మండలం కరవంజ గ్రామంలో వెలిసిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం నుండి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ సర్పంచ్ జుత్తు నేతాజీ, మాజీ సర్పంచ్ జుత్తు అప్పలనాయుడు తెలిపారు. శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తిరువీధి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయానికి చుట్టువక్కల గ్రామ ప్రజలు వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.